

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**రక్షలు రక్షలు.. పాదరక్షలూ..**

ప్రస్తుతం మనకి అర్జంటుగా కావల్సినవి కొత్త చెప్పులు. అసలు ఏ చెప్పుల జతనన్న ఎన్నాళ్ళు వాడతాం? నా పాదాల సైజేమో పెరుగుతోంది. చూపించినా, వివరించి చెప్పినా మా అమ్మ "మూడేళ్ళేగా అయింది? ఇప్పుడే ఎందుకూ? ఇంకో రెండేళ్ళుపోనీ!" అంటోంది.

"నడవలేను తల్లీ!" అన్నాను.

"వచ్చే ఏటికి మళ్ళీ పాదాలు పెరిగితే మళ్ళీ ఇంకో జతకి డబ్బులు పెట్టడం దండగ, కనక వీటినే వేసుకో తల్లీ!" అని మా అమ్మ మొరాయించింది.

ఆశ్రమం ముందూ, శివాలయం ముందూ వదిలేసి చూశా. ఎవరన్నా ఎత్తుకుపోతే బాగుండునని. ఊహూ! ఓ రోజు వాటిని మా అమ్మ చూడకుండా నీళ్ళల్లో నానేశా. చీకిపోతే చిరుగుతైకదా అని. ఉహూ..! పరిగెత్తినా చిరగలా. చిరగటానికి అవేమన్నా ఆషామాషీ చెప్పులా.. మా సుబ్బన్న కుట్టినవి. మనిషన్నాపోతాడేమోగానీ చెప్పు మాత్రం చిరగదుగదా. పోనీ అరుగుతుందా అని చూసినా అరగవు. ఎందుకంటే కింద పల్చని టైరు ముక్కతో జోడించాడు గదా.

అసలు సుబ్బన్న చెప్పులు ఊళ్ళోనేగాదు.. చుట్టుపక్కల ఊళ్ళల్లో కూడా ప్రసిద్ధి చెందినవి. కిర్రుచెప్పులు, టైరు చెప్పులు, ఆకుజోళ్ళూ, ఇంకా నాజూగ్గా మహా వైభవంగా ఉంటే 'నిజాం చెప్పులూ' ఇలా చాలా రకాల జోళ్ళు తయారు చేసేవాడు. కిర్రుచెప్పులూ టైరు చెప్పులూ మాత్రం అమ్మకానికి సిద్ధంగా ఉండేవి. మిగతావి మాత్రం కొలతలు ఇచ్చి కుట్టించుకోవాల్సిందే

"సుబ్బన్నా.. నా చెప్పులు అర్జంటుగా 'పనికిరాకండా' పోవటానికి ఏదైనా ఉపాయం చెప్పు!' అనడిగా.

"అమ్మాయిగారూ.. చెప్పుల్ని పనికొచ్చేటట్టు చెయ్యడమేగానీ పనికిరాకుండా చేసే పనికిమాలిన పనిని యీ సుబ్బన్న చెయ్యడండీ!" అన్నాడు.

అనవసరంగా ఇంకో కష్టం తెచ్చుకున్నా. ఒకవేళ ఇప్పుడీ చెప్పులు నిజంగా పోయినా, "అమ్మాయిగారెక్కడో కావాలని పడేసి ఉంటారండి!" అని మా నాన్నతో చెప్పడూ! ఇంకో దుకాణాలు రెండున్నాయిగానీ, వాటిలో 'కుట్టే' పనికన్నా 'రిపేరు' పనులే ఎక్కువ జరుగుతై. అంతేగాక వాళ్ళు కుట్టినవి వేసుకుంటే 'ఒంటె నడక' వస్తుందని సరదాగా మా ఊళ్ళో అనుకుంటారు.

ఇంతకీ యీ చెప్పులగోల ఏమిటనా? సరస్వతి కొత్త చెప్పులు.. పుష్పకుమారి, జయా, విజయా రాధ, రేచల్ ఇంతమందీ కొత్త చెప్పులు కొనుక్కున్నారు. ఆఖరికి కమలకుమారి కూడా కొత్త చెప్పులు టకటకలాడిస్తూ నాముందు పెళ్ళినడకలు నడిచింది. థర్డ్ ఫాం 'ఏ' సెక్షన్‌లో కొత్త చెప్పులు వేసుకోని అమ్మాయి కేవలం క్లాస్‌మేట్ సీత మాత్రమే అనుకున్నప్పుడల్లా గుండె డబడబలాడిపోదూ? అదేగాదు.. అందరూ ఓణీలు వేస్తున్నారు. నేను తప్ప. అదేమిటో, నేను గడక్రరలా ఎదుగుతున్నాగానీ వాళ్ళల్లాగా 'అడ్డంగా' ఎదగట్లా. ఆమాటే మా సుశీలా టీచర్‌తో అంటే, "వాలీబాల్‌కి బ్రహ్మాండంగా పనికొస్తావు. డోంట్ వర్రీ" అని నవ్వింది.

ఆ మాటా నిజమే.! నేను ఎగిరి బంతిని కొట్టానంటే గ్యారంటీగా పాయింట్!

ఇంతకీ వాళ్ళ 'టెక్కు' ఏమంటే, మా ఊళ్ళో కొత్తగా పెట్టిన 'బాటా' దుకాణంలో 'హవాయి' చెప్పులు కొనిపించుకుని, వాటిని టకటకలాడిస్తూ నడుస్తున్నారు. నడిచారుబో.. నావంక చూడనేలా? చూశారుబో - చూస్తూ చూస్తూ నవ్వనేలా?

ఇహ లాభం లేదనుకుని నా చెప్పునొకదాన్ని 'వీరగడి'లో పారేశా. వీరగడి అంటే మా ఊళ్ళో ఉన్న పాడుబడిన మోటబావి. రెండో చెప్పుని భద్రంగా చేతుల్తో పట్టుకుని, "అమ్మా.. నా చెప్పు ఓ కుక్క ఎత్తుకు పోయిందే. రేపు స్కూలికి ఎలా వెళ్ళనూ?" అని అమాయకంగా అన్నాను.

"పారేశావా? కుక్క ఎత్తుకుపోయిందా?" అనుమానంగా నా వంక చూస్తూ అంది.

"నిజంగా కుక్క ఎత్తుకుపోయింది. చాలాసేపు దాని వెనకాల పరిగెత్తా కూడానూ!" అన్నాను.

"కుక్క ఎటువేపు వెళ్ళింది?" అదోలా చూస్తూ ప్రశ్నించింది మా డిటెక్టివు.

"వీరగడివైపు" జవాబిచ్చా.

"సరే! మీ నాన్న వచ్చాక కొత్త చెప్పుల విషయం చెబుతాలే!" అన్నది.

ఉత్తి దొంగ మొహంది మా అమ్మ. ఏం? మా నాన్నకి నేను చెప్పుకోలేనా? వెంటనే కొనిపెడతాడు. నేను మా నాన్నని అడిగితే, యీవిడ 'కొనొద్దని' అడ్డుపడుతుందని తెలిసే, ఇటునించి నరుక్కొచ్చా.

"ఆహా.. రేపటికల్లా యీ యొక్క సీతకూడా 'బాటా' చెప్పుల్తో టకటకలాడుతు తిరుగుతుందిగదా!" అని లోలోపల పొంగిపోయాను.

ఏలూరెళ్ళిన మా నాన్న ఆ రాత్రి ఇంటికి రాలేదు. మరుసటి రోజు పొద్దున్నే లేచి చూద్దునుగదా, వీరగడిలో పారేసిన నా చెప్పు భద్రంగా రెండోదాని పక్కన ఉంది.

"ఇదేంటీ? యీ చెప్పు ఎక్కడ్నించి వచ్చింది?" అయోమయంగా మా అమ్మతో అన్నాను.

"కుక్క వీరగడివైపు వెళ్ళిందన్నావుగా! అందుకే కరణంగారి పాలేర్ని వీరగడిలో చూసిరమ్మన్నా. ఆ 'కుక్క' చెప్పుని మామూలుగా పడేసి ఉంటుంది. పైపైనే ఉందిట, పాలేరు గాలంతో తీసిపట్టుకొచ్చాడు" అన్నది.

'ఛీ..' ఓ రాయి కట్టిపడెయ్యాల్సింది. పొరబాటు చేశా.

"అయినా కుక్క ముట్టిన చెప్పుని మళ్ళీ తొడక్కూడదని అంటారుగా? నేను మాత్రం దాన్ని తొడగను!" ప్రొటెస్టు చేశా.

"కుక్క ముట్టిన 'కుండ'ని తాకరాదంటారుగానీ, చెప్పునిగాదు. తొడక్కపోతే మానెయ్. కాళ్ళు కాలేది నీకే!" అన్నది నిర్వికారంగా.

ఇదేం మనిషీ!

పంతంకొద్దీ చెప్పులు వేసుకోకుండానే స్కూలుకి పోయా. పొద్దున ఫరవాలేదుగానీ, మధ్యాహ్నం తారురోడ్డు మీద కాలుపెట్టేసరికి పాదాలు చుర్రుమన్నాయి. ఒక్క అడుగు ముందికి పడదూ. సైకిలు తెచ్చుకోలేదు. ఏం చెయ్యాలో అర్థంగాక కళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

"సీతా, మరేం పర్లేదే. అక్కడ పేడవుంది చూడు. దాన్ని తొక్కి నడు. కాళ్ళు కాలనే కాలవు!" అని ముత్యాలోడు అన్నాడు. రెండు కాళ్ళూ పేడతో తొక్కినడిచా. నిజంగా కాళ్ళు కాలలా. వాడి పాదాలు చూస్తే అవీ పేడతోనే ఉన్నై.

"నీకెట్టా తెల్సురా?" అన్నా.

"ఎండాకాలమంతా మనపని పేడతొక్కుడే! పుస్తకాలకే డబ్బులివ్వని మా నాన్న చెప్పులకేమిస్తాడే!" నవ్వాడు ముత్యాలోడు.

నిజమే. మా క్లాసులో కనీసం సగం మందికి చెప్పుల్లేవు. ఉన్నా టైరు చెప్పులు. ఒకసారి కొంటే పదేళ్ళకైనా తిరుగుండదు. అవీ కొనలేని వాళ్ళు ఎంతమందీ?

చచ్చినా మా అమ్మని మళ్ళీ చెప్పులు కొనమని అడగొద్దనుకున్నా. మూడు నెలలు నా పాత చెప్పుల్నే వేసుకు తిరిగా.

అప్పుడు తెలిసింది 'హవాయి చెప్పులసోకు! స్ట్రాపులు తెగిపోతే పిన్నీసులతో వాటిని జాయిన్ చేసి తిరుగుతున్నారు మా మొనగత్తెలు. నేను మాత్రం సుబ్బన్న చెప్పుల్నే టకటకలాడిస్తూ తిరిగా. సంక్రాంతికి మా అమ్మే కొత్తచెప్పులు కొనిస్తానని నన్ను బాటా షాపుకి తీసికెళ్ళిందిగానీ, "నేను సుబ్బన్న దగ్గరే ఆకుజోళ్ళు కుట్టించుకుంటా, లేకపోతే చెప్పులే వద్దు" అని తెగేసి చెప్పి, సుబ్బన్న దగ్గరే కొత్త చెప్పులు కుట్టించా. ఆ మాటే మా అమ్మ సుబ్బన్నతో చెబితే, సుబ్బన్న పొంగిపోయి, "పాపమ్మగారు బంగరు తల్లి కదండీ! కంపెనీవోళ్ళ చెప్పులకీ మనం కుట్టే చెప్పులకీ ఉండే తేడా కటిక్కిన కనిపెట్టేశారు" అని మహా సుందరంగా ఆకుజోళ్ళు కుట్టిచ్చాడు.

వినడానికి ఇదంతా సరదాగా ఉందేమో నాకు తెలీదుగానీ, నాకు మాత్రం కళ్ళవెంట నీళ్ళు తిరుగుతున్నాయి. మొన్నామధ్య మా ఊరు వెళ్ళి చూస్తే 'కంపెనీ' దుకాణాలేగానీ, చక్కగా సౌకర్యంగా చెప్పులు కుట్టి ఇచ్చే సుబ్బన్నలు మాత్రం కరువయ్యారు. లేదు.. కనుమరుగైపోయారు. బస్తీ నాగరికత వొచ్చి, నిజమైన 'నాగరికుల్ని' వేళ్ళతో సహా పెకలించేసింది. తాలూకాఫీసు దగ్గర మాత్రం ఓ ముసలాయన తెగిన చెప్పుల్ని కుట్టివడానికి మిగిలున్నాడు. కానీ, తెగిన చెప్పుని కుట్టించుకునే మనుషులు ఏరీ?

*'సా' మిల్లు వచ్చిందోచ్!*

మాదాలోళ్ళ ఇంటికి అవతల పక్కన దిట్టమైన రేకులషెడ్డు వేస్తున్నారు. ఆ పక్కనే వున్న మామిడితోటలోనే అవాళ మా ఆటలపోటీలు. మా ఆటలపోటీలంటే, హైస్కూలివికావు. మేడబడికీ - పాకబడికీ మధ్యన. థర్డ్‌ఫాంలోకి వచ్చినా మా పునాదుల్ని మేం మరిచిపోలేదు. గొప్పలు వాళ్ళవీ.. గెలుపు మాదీ.

'రింగ్ టెన్నిస్' రంజుగా సాగుతుంటే ఒకాయనొచ్చి, "ఆటలయ్యాక ఆ షెడ్డులోకి రండి. బిళ్ళలు పంచిపెడతా!" అన్నాడు. నాకేమీ అంత ఉత్సాహం అనిపించలా. కానీ మావాళ్ళు ఆగితేగా! మావాళ్ళు బలవంతపెట్టి నన్నూ లాక్కుపోయారు. మేం వెళ్ళగానే మొహం 'ఇంత' చేసుకుని మరమరాల ఉండలూ, శనగపప్పు ఉండలూ, జీళ్ళూ, నిమ్మతొనలేకాక తలో చక్రకేళీ అరటి పండూ కొబ్బరి ముక్కలూ కూడా ఇచ్చాడు.

"ఇక్కడ ఏం చెయ్యబోతున్నారూ?" అడిగా.

"ఇక్కడ దుంగల్ని ముక్కలుగా కోస్తాం. ఇహ తలుపులూ దర్వాజాలూ, పలక బద్దీలూ, వాసాలూ అన్నీ ఇదిగో.. యీ స్టీలు బ్లేడుతో కోసి తయారు చేస్తామన్నమాట. ఇవాళ మంచిరోజు గనక పూజచేశాం!" అన్నాడు.

మరుసటిరోజునించీ దుంగలే దుంగలు వచ్చిపడ్డాయి. పనివాళ్ళుకూడా బెజవాడ నించి వచ్చారు. ముమ్మరంగా పని మొదలయింది. నెలరోజులకల్లా మా ఊళ్ళో 'పొట్టుపొయ్యిలు' అమ్మకానికొచ్చాయి. మూడురాళ్ళు పెట్టి, దానికింద కట్టెపుల్లల్తో మంటపెట్టె వంటలు చేసే వాళ్ళు అట్లాగే, ఇటుకలూ మట్టితో చక్కగా పొయ్యిలూ గట్టూ నీటుగా తయారుచేసి, పేడతో అలికి, ఆ పొయ్యిమీద వండేవాళ్ళు ఆడంగులు.

ఆ తరువాత కాస్త 'నాజూకు' తనం పెరిగి, కట్టెపుల్లలు కాలట్లేదనీ, పొగవస్తోందనీ ఆడాళ్ళు కంప్లైంట్లు చేస్తుంటే - ఆ టైపు పొయ్యిలు పోయి కుంపట్లు వచ్చాయి. కుంపట్లకి కట్టెలతో పనిలేదు. బొగ్గులుంటే చాలు. ఓ చుక్క కిరసనాయిలు వేసి ముట్టిస్తే చాలు.. చులాగ్గా బొగ్గులు అంటుకునేవి.

ఇప్పుడీ పొట్టుపొయ్యిలొచ్చాయి. రోకలి తీసుకుని ఆ పొట్టు పొయ్యి మధ్యన్ నిటారుగా పెట్టి చుట్టూ, 'సా'మిల్లు దగ్గర్నించి తెచ్చిన రంపంపొట్టుని గట్టిగా కూరి, రోకల్ని నేవళంగా పొట్టు రాలకుండా బయటికి తీసి, ఓ కర్ర పుల్లతో మంట పెడితే, ఆ పొట్టు పొయ్యి దానిపట్టున అది మండుతూ ఉంటుందన్నమాట.

రంపం పొట్టు మొదట్లో ఫ్రీగా పట్టుకుపొమ్మనేవాడు సామిల్లు ఓనరు నారాయణ. ఆ తరువాత బస్తా అర్ధరూపాయి. ఆర్నెల్లు తరవాత బస్తా రూపాయి ఇలా పెరుగుతు పోయింది. కట్టె పుల్లలు అమ్మేవాళ్ళ నోట్లో కుంపట్లు మన్నుకొడితే, బొగ్గు తయారీ వాళ్ళ నోట్లో రంపంపొట్టు మన్ను కొట్టింది. ఇప్పుడు 'గేస్' ధరల్ని భరించలేక ఎవడి నోట్లో వాడే మట్టికొట్టుకుంటున్నాం. అయితే పొట్టుపొయ్యికీ - గ్యాస్ బండకీ మధ్యలో కిరసనాయిల్ 'స్టౌ'లు వచ్చినై.. అదో కథ!

ఇంతకీ యీ పొట్టుపొయిలొచ్చి నా మెడకి చుట్టుకున్నై.. శివుడి మెళ్ళో పాముల్లాగా! పరమ పీనాసి అయిన మా అమ్మ రెండు పొట్టుపొయ్యిలు కొంది. అప్పుడే నాకు అనుమానం వచ్చింది.. ఏదో తేడా ఉందని.

"ఇదిగో సీతా, ఇవాల్టినించీ యీ పొట్టుపొయ్యిలు వెలిగించడం, ఓదాన్లో నీళ్ళు కాచడం, రెండో దాన్లో ఎసరు పడెయ్యటం నీ వొంతు!" అన్నది.

"చక్కగా 'కాగు'లో కాయమంటే స్నానానికి నీళ్ళు కాస్తాను. యీ పొట్టుపొయ్యి గొడవ నాకు పెట్టకు!" అని చికాగ్గా అన్నాను.

మా అమ్మ మహా తెలివైంది. మెల్లిగా ఒక పని ఒకరోజున వప్పచెపుతుంది.

ఆరోజు ఆ పని చేస్తే అంతే.. మరుసటి రోజునించీ చచ్చినట్టు ఆ పని మనం చెయ్యాల్సిందే! ఆది నిష్టూరం మంచిదికదా అని మొదట్లోనే నేను మొరాయించాను.

పెద్దగా ఆవిడ చదువుకోకపోయినా, 'పల్లెటూరి తెలివితేటలు' మాత్రం బ్రహ్మాండంగా ఉన్నై.

"ఏవండోయ్ ఇటండీ" అని మా నాన్నని పిలిచింది.

"ఏమిటే?" అని పనిచేసుకుంటున్న మా నాన్న బయటికి రాగానే,

"దీనికి పన్నెండేళ్ళు వచ్చాయిగదా! రేపో మాపో ఇంకో అయిదేళ్ళకో పెళ్ళిచెయ్యాలిగదా.,! అంటే ఈ 'దేభ్యానికి' పనీపాటూ నేర్పాలి గదా! లేకపోతే, దీని అత్తింటివాళ్ళు ఏమంటారూ? 'ఉత్తి'గడేకార్'లాగా దీని తల్లితండ్రులు పెంచారు' అని మనని అనరా? ఏం? నేను చిన్నప్పటినించీ నేర్చుకోలేదా? ఇప్పుడు దీనికి పనినేర్పకపోతే దీని అత్తింటివాళ్ళు మనకి గడ్డి పెట్టరా?" అని దండకం మొదలెట్టింది.

ఎంత మొగలాయీ యైనా, 'పిల్ల పెళ్ళి - అత్తారిల్లూ' అనంగానే మెత్తబడక తప్పదుగదా.! మా నాన్నా అలాగే మెత్తబడి, "అదికాదమ్మా.. మరి పనులు నేర్చుకోవాలి. లేకపోతే ఎలా?" అన్నాడు.

"అంటే ఎవరింట్లోనో నేను వంటపనిచెయ్యడానికి ఇప్పట్నించే యీవిడ నాకు ట్రైనింగిస్తుందా? ఆడదంటే పనులు చెయ్యడానికేనా పుట్టింది? 'నేను చిన్నప్పటినించీ చెయ్యట్లేదూ' అంటూ యీ భాగ్యమ్మగారు దీర్ఘాలు తీస్తోందిగానీ, జన్మలో ఒక్కపనికూడా పుట్టింట్లో చెయ్యలేదని ఎన్నిసార్లు మనముందర గప్పాలు కొట్టలేదు నాన్నా? ఆవిడ మాత్రం పుట్టింట్లో గొబ్బెమ్మలాగా కూచుంటుందా? నేను మాత్రం ఇప్పట్నించే వండివార్చాలా? ఇదేం న్యాయం?" అని ఎదురు వాదించాను.

"అదికాదమ్మా.. నువ్వు గనక కొంచెం వంట నేర్చుకున్నావనుకో, కనీసం నెలకి మూడురోజులూ నేను చెయ్యికాల్చుకునే పని తప్పుతుందిగా!" తలగోక్కుంటూ అన్నాడు మా నాన్న. ఆమాట నిజమే. వంటపని పాపం ఆయనకి రానేరాదు. ప్రతీసారి మా అమ్మ 'కొలతలు' చెప్పి చేయిస్తుంది.

"సరే నాన్నా.. నీకోసం, కేవలం నీకోసం.. ఈ క్షణం నించే నేను వంట నేర్చుకుంటా. అంతేగానీ యీ భాగ్యలక్ష్మి కుతంత్రానికి లొంగికాదు." బెట్టుగా అన్నా.

"కుతంత్రమా? ఏం కుతంత్రమే.. కొడితే మాడు పగిలిపోతుంది!" కోపంగా నా మీదకి వచ్చింది.

"కుతంత్రంకాక? నువ్వు రెండుపొట్టుపొయ్యిలు ఎప్పుడు కొన్నావో అప్పుడే నాకు తెలుసు.! ఏదో ప్లాను వెయ్యిబోతున్నావని. అమ్మ పుట్టిల్లు కూతురికి తెలీదా?" అన్నా.

"ఏం తెలుసు నీ బొంద? బొగ్గులకి చచ్చేంత ఖర్చవుతోంది. ఆ సా మిల్లు ఆయన కూతురు నీ ఫ్రెండేగా! వారానికో బస్తా పొట్టు తెస్తే వంటంతా పొట్టుపొయ్యిమీదే లాగించి నీ పెళ్ళికి కాసిని డబ్బులు కూడబెడదామనుకున్నానేగానీ నీ మీద కుతంత్రాలు చెయ్యడానికి నువ్వేమైనా నా అత్తవా ఆడబడుచువా?" మళ్ళీ దీర్ఘం తీసింది మా అమ్మ.

ఇంకేం చెబుతాం?

‘ఆపద్బాంధవుడు‘ అంటే సినిమా అనుకునేరు!. కానేకాదు. ఎంతమంది చుట్టాలొచ్చినా క్షణాల్లో ‘రెడీ‘ చెయ్యగల ఏకైక వంటకం ‘ఉప్మా‘ గనక, ఉప్మాకి నేనా పేరు పెట్టాను. నేను మొట్టమొదటిసారి చేసింది ఉప్మానే. మా అమ్మ ‘మూడ్రోజుల శలవు‘ తీసుకోగానే నేను దర్జాగా కుంపటి సిద్ధం చేశా. పెరట్లోంచి మాంఛి పచ్చిమిరపకాయలూ, బుట్టలోని ఉల్లిపాయలూ, మా పెరడునే ఆనుకుని వున్న వెనకాలింటివాళ్ళ పెరడులో నవనవలాడుతున్న రెండు రామములక్కాయలూ, సన్నగా చక్కగా తరిగిపెట్టా. మరీ లేత - మరీ ముదురూ కాని అల్లాన్ని అందంగా తరిగి ఇందాకటి వాటితో జతచేశా.

ఇప్పుడు కుంపటి వెలిగించా. నాలుగు ఊదులు ఊది, మొన్నామధ్యే మా అమ్మ కొన్న దళసరి సత్తు మూకుడ్ని కుంపటి మీద పెట్టా. ఆ మూకుడు వేడెక్కేలోపే పోపు గింజలు సిద్ధం చేశా. ఓ పదిహేను పదహారు జీడిపప్పుల్ని బద్దలు విడదీసి సగానికి తుంచి ముందుగా వాటిని నేతిలో వేయించి పక్కన పెట్టా. మళ్ళీ మూకుళ్ళో ‘లిబరల్‘గా నూనె పోసి పోపు చిటపటలాడాక పచ్చిమిర్చీ, అల్లం రామ్ములక్కాయ ముక్కలూ వేసి, ఉల్లి తరుగుపడేసి నేవళంగా కాస్త వేగాక 1- 21/2 కొలతతో నీళ్ళుపోశా. (అంటే, ఒకగ్లాసు బొంబాయి రవ్వకీ రెండున్నరగ్లాసుల నీళ్ళు.. మూడు అయితే ఇంకా మంచిది.)

ఆ యొక్క నీరు మరుగుతున్నప్పుడు ఉప్పువేసి, ఓ చెంచాతో, ఆ ఉప్పు సరిపోతుందని నిర్ధారించుకుని (నీళ్ళు రుచుచూసి అన్నమాట) పలుచగా రవ్వపోస్తూ మరో చేత్తో గరిటను తిప్పుతూ (ఉండలు కట్టకుండా) మొత్తం రవ్వని ఆ నీళ్ళల్లో కలిపేశా. అది కుతకుతా ఉడుకుతుండగా సువాసన వచ్చింది చూడూ.. సామిరంగా.. నాకే నేను ముద్దొచ్చా!

ఉమ్మగిల్లటానికి పైన ఓ స్టీలు ప్లేటుతో మూకుడిని మూసి, రెండు నిమిషాలుంచాను.

ఆ తరవాత ఆ ప్లేటుని తీసి మాంఛి పేరునెయ్యిని ఓ గరిటెడు గుమ్మరించి బాగా కలిపి మూకుడ్ని కిందకి దించా.

మ నాన్నకి ఓ వెండి ప్లేటుంది. ఆ ప్లేటు మా నాయనమ్మ కొనిపెట్టిందిట. మా అమ్మ ఎంతటిదంటే, వాళ్ళ వాళ్ళు పెట్టిన వెండి కంచంలోనే మా నాన్నకి అన్నం పెడుతుంది గానీ, మా నాన్నమ్మ కొనిపెట్టిన దాంట్లో చచ్చినా పెట్టదు.

నేనివ్వాళ ‘ఆ‘ వెండి ప్లేటుని మా అమ్మ వాకిట్లో కూచోంగానే బయటకు తీసి, తెల్లని మెత్తని బూడిదతో ధగధగలాడేలా తోమి సిద్ధం చేశా.

ఆ ప్లేట్లో అందంగా చక్కగా ఉప్మా వొడ్డించి, ఆ ఉప్మాపైన దిట్టంగా నేతిలో వేయించిన జీడిపప్పుల్ని అద్ది. నంజుకొడానికి ఎర్రని ఆవకాయపిండి (ముక్కకాదు), ఓ చెంచాడు పంచదారా అందంగా ఉప్మాకి అటూ ఇటూ పెట్టి, అవసరమైతే పిండుకోవడానికి ఓపావు చెక్క నిమ్మకాయకూడా పెట్టి, ఉప్మాలో వెండిస్పూను గుచ్చి మా నాన్న చేతికి అందించా.

మా నాన్న పేపరు పక్కన పెట్టి, "ఇంకా నేను స్నానమే చెయ్యలేదుగదమ్మా... ఇప్పుడే టిఫినెందుకూ?" అంటూ ఉప్మా ప్లేటు అందుకుని ఓ స్పూనుతో ఆయొక్క ఉప్మా నోట్లో పెట్టుకుని తిని, "అబ్బ. అద్భుతంగా ఉందే సీతా.. ఏదీ.. మీ అమ్మని పిలు.! అచ్చు

మా అమ్మ చేసినట్టు బోలెడు నెయ్యీ. జీడిపప్పూ వేసి చేసిందివ్వాళ!" అన్నాడు ఆయన అల్పసంతోషి. అది మా అమ్మ చేసిందనుకుంటున్నాడు.

"అమ్మ తొమ్మిదింటినించీ శలవులో వుందికదా నాన్నా!" అన్నాను.

"అంటే? ఈ ఉప్మా నువ్వు చేశావా?" ఆశ్చర్యంగా అన్నాడు మా నాన్న. "అవును. కుదిరిందా?" అడిగా.

"కుదరటమా.? అదిరిపోయింది. అయినా ఎప్పుడు నేర్చుకున్నావే సీతా! హాయిగా ఆవపిండితో ఉప్మా జతపెట్టి తింటూ అన్నాడు మా నాన్న. మొహం వెలిగిపోతోంది.

"ఇదేం బ్రహ్మ విద్యా ఏమిటీ? అమ్మ చైడం చూస్తూనే ఉన్నాగా! సుమారుగా వేసి చూశా.!" లోపల మురుసుకున్నా పైకి మామూలుగా అన్నా.

"బ్రహ్మాండం.!.. ఇంతకీ మీ అమ్మకి పెట్టావా?"

"ఉహూ! ముందు నీకు పెట్టి, నువ్వు బాగుందంటే పెడదామని చూస్తున్నా!"

"తిరుగులేదే! నీ ఉప్మా ముందర కృష్ణయ్య హోటల్ ఉప్మా కూడా దిగదుడుపే.. శభాష్." అని, అప్పుడు చూశాడు ప్లేటుని మా నాన్న.

"మా అమ్మ నాకు కొనిపెట్టిన వెండి ప్లేటులో పెట్టి ఇచ్చావా బంగారూ, అందుకే మా అమ్మ చేసిన ఉప్మా గుర్తొచ్చింది." అని తల అటు తిప్పుకున్నాడు. నాకు తెలుసు.. ఆయన కళ్ళల్లో నీరు తిరిగివుంటుందని.

"ఇహనించి ఆ ప్లేటులోనే మీకు వడ్డిస్తానాన్నా, యీ మూడురోజులూ వంటింటి రాజ్యం నాదేగా!" గర్వంగా అన్నాను.

మూడు పెద్దబాదం ఆకుల్ని చీపురుపుల్లతో టిఫిన్ ప్లేటుగా కుట్టి; కడిగి, తుడిచి, వేడివేడి ఉప్మా అందంగా పెట్టి, జీడిపప్పుల్ని అమర్చి, కాస్త ఆవకాయా, ఓ నిమ్మచెక్కా పొందిగ్గా పెట్టి పెరటి అరుగుమీద కూర్చున్న మా అమ్మ ముందు పెట్టాను. ఇంట్లోకి వెళ్ళి ఓ చెంబుడు నీళ్ళు కూడా తెచ్చిపెట్టాను.

"ఎవరూ చేసిందీ? మీ నాన్నేనా?" చేత్తో కొంచెం ఉప్మా తీసుకుని నోట్లో వేసుకుని అన్నది మా అమ్మ.

"నేనే చేశా!" అన్నాఉ.

"బ్రహ్మాండంగా ఉంది. ఇంకో న్నాల్రోజులు నువ్వు వంటగదిలో వుంటే కొంపకొల్లేరే! అవ్వ.. ఇన్ని జీడిపప్పులా? ఇంత నెయ్యా? ఇంత నూనా?" మింగుతూనే వంకలు పెడుతోంది.

"హూ.! నువ్వు 'మీ వాళ్ళొచ్చినప్పుడు' ఇలాగే చేస్తావుగదా! అయినా, ఏదో చిన్నపిల్ల చేసిందిగదా అని మెచ్చుకోలు లేకపోగా వంకలు పెడతావా వంకలు." నాకు కోపం వచ్చిందంటే రాదు మరి.

"బాగోలేదని అన్నానా? జీడిపప్పూ నెయ్యీ ఎక్కువ వేశావని అన్నాను. దానికే అలకలా?" తీరిగ్గా రుచిమరిగినట్టు తింటూ అన్నది.

"సర్లే.! ఇంకొంచెం కావాలా?" ముక్తసరిగా అన్నాను.

"పట్టుకురా!. మళ్ళీ ఆయనొచ్చేదాకా తిండివుండదుగా!" అన్నది.

మా నాన్నకి ఇంకో గరిటెడు మా అమ్మకి ఇంకో రెండు గరిటలూ వడ్డించాక అప్పుడు నేను నా ప్లేట్లో ఉప్మా పెట్టుకుని తిన్నాను. చెప్పొద్దూ.. అద్భుతంగా కుదిరింది.

అలా నా మొదటి 'వంటకం' అధ్యాయం విజయవంతంగా ముగిసింది. ఆ రోజే మధ్యాహ్నం బెండకాయ కూరా, బీరకాయ పచ్చడీ, సొరకాయపప్పు కూడా చేశా.., మా అమ్మ డైరెక్షన్‌లో. రసం కూడా (అంటే చారు) పెట్టా. దాంట్లో పక్కింటివాళ్ళ పెరట్లోంచి 'ఎత్తేసిన' రెండు రామ్ములక్కాయలు పడటంతో బ్రహ్మాండమైన రుచి వచ్చింది. ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. పైకి నేను దుబారా

అని అన్నా, పక్కింటి పిన్నిగారితో "ఏమో అనుకున్నా నొదినా.. మా సీతలేదూ.. ఇవాళ బ్రహ్మాండంగా వంటలు చేసింది.. పొద్దున ఉప్మా అయితే దానంతట అదే చేసింది. మధ్యాహ్నం కూడా పప్పూ పచ్చడి చిటికెలో నేర్చేసుకుంది. ఇప్పుడు నా ప్రాణానికి హాయిగా ఉందనుకో!" అని నన్ను తెగ పొగిడింది.

మనం చేసిన వంట 'బాగుంది' అని పదిమందీ అంటే తింటే, ఎంత ఆనందం కలుగుతుందో అవాళ నాకు అనుబవం అయింది.

అప్పుడే నిర్ణయించుకున్నాను.. మా అమ్మ దగ్గర వంటలన్నీ నేర్చుకోవాలని. అలాగే పిండివంటలు కూడా నేర్చేసుకోవాలని.

మొత్తానికి ఆ మూడురోజులూ వంటలు నావే. పొద్దున్నే లేవడం, స్నానం కానిచ్చేసి టిఫిన్ రెడీ చెయ్యడం, ఓ పొట్టుపొయ్యిమీద అత్తెసరు పడేసి కుంపటి మీద కూరలు చేసెయ్యడం, ఓ పొట్టు పొయ్యిమీద అత్తెసరు పడేసి కుంపటి మీద కూరలు చేసెయ్యడం. ఇలా క్షణం తీరిక లేకుండా గడిచాయి ఆ మూడురోజులూ. రాత్రికి మళ్ళీ ఏదో ఓ కూర చేసేదాన్ని.

మొదటి రోజున ఆపద్బాంధవుడు (ఉప్మా) ఆదుకుంటే, రెండో రోజు మినప్పప్పు రుబ్బి దోశలు వేశా. (మినుమూ బియ్యం పాళాలు మా అమ్మ చెప్పి ముందు రోజు రాత్రే నా చేత మా అమ్మ పిండి రుబ్బించింది) మూడోరోజు పూరీలూ, ఉల్లిపాయా శనగపిండితో కూర.

రెండు మూడు పూరీలు కాస్త బండగా వచ్చాయిగానీ, తరవాత సమంగా చక్కగా వత్తడం అలవాటయింది.

మా నాన్న మాత్రం మహా ఆనందించాడు. మొదటిరోజున పప్పులో కాస్త 'ఉప్పు' ఎక్కువైనా, "అన్నంతో కలిపాక ఉప్పు సరిగ్గానే ఉందే!" అంటూ బాగా మెచ్చుకున్నాడు.

అన్నంలో కలిపినా ఉప్పు కాస్త ఎక్కువగానే ఉందని నేను తిన్నప్పుడు తెలిసింది. మా అమ్మ మాత్రం నిర్దాక్షిణ్యంగా నా వంటలోని లోపాలు బైటపెట్టింది.

"నేను ఉన్నదున్నట్టు చెబుతున్నా! నూనె వాడకం కాస్త తగ్గించు.! ఆ ముక్కలు తరగటం నీకింకా పట్టుబడలా; అలాగే ఉప్పు సరిగ్గా లేకపోతే నలభీమపాకమైనా ఛండాలంగ ఉంటుంది. ఆడదాని తెలివంతా 'ఉప్పు' కరెక్టుగా వెయ్యడంలోనే ఉంది. అతివృష్టీ అనావృష్టీ కూడదు.! పోపు గింజలు మరీ ఎక్కువ వేస్తున్నావు. చూసి వెయ్యి.!" అంటూ.

ఆ రోజునుంచీ మా నాన్నకి నెలనెలా చెయ్యి కాల్చుకునే బాధ తప్పిందని మాత్రం ఘంటాపథంగా చెప్పగలను.

***కార్డొచ్చింది....***

పోస్టాఫీసు చాలా గొప్పది. ఎందుకంటే 'లంచం' అనేమాటకి పోస్టాఫీసులో అవకాశమే లేదు. 'కాటికి పోయినా లంచాలు ఉంటైగానీ పోస్టాఫీసులో మాత్రం ఉండవు. అందుకే పోస్టాఫీసుని చూడగానే నాకు సత్యహరిశ్చంద్రుడు జ్ఞాపకం వస్తాడు. అసలు నా చిన్నప్పటినించీ నేనో పోస్ట్‌మేన్‌ని కావాలని ఉండేది. ఉత్తరాల బంగీ విప్పి, ముద్రలు కొట్టడం ఎంత మజా! మా ఊరి పోస్టుమాస్టారి పేరు చొదిమెళ్ళ శ్రీరామ్మూర్తిగారు. పోస్టాఫీసూ ఇల్లూ ఒకటే. ఆ రోజుల్లో తాలూకాఫీసు తరవాత యమ బిజీగా ఉండే ఆఫీసు పోస్టాఫీసే. కార్డు అణా కవరు, అంటే ఇన్‌లాండ్ కవర్ అణన్నర, ఇండియన్ కవర్ బేడా. ఆ కవర్‌లో మరీ ఎక్కువ పేజీలు పెడితే తూకం వేసి తగినన్ని స్టాంపులు అంటించమనేవాళ్ళు. అదిగాక మళ్ళీ పోస్టల్ సేవింగ్సూ, మనియార్డర్లూ, టెలిగ్రాములూ. 'టెలిఫోన్' కూడా ఉండేది. టెలిఫోన్ తో మా ఊరి జనానికి పెద్ద పనేం ఉండేదిగాదు. 'టెలిగ్రాం' వచ్చిందంటే అందరికీ భయమే. ఎవరన్నా 'పైకి' పోయినప్పుడే టెలిగ్రాములు పంపేవారు. చాలామందికి చదవటం వ్రాయడం రాదు. అందువల్ల ఉత్తరాలు రాసే బాధ్యతా చదివే బాధ్యతా కూడా అప్పుడప్పుడూ పోస్టు మాస్టారిపైనే పడేది. వాళ్ళమ్మాయి 'లక్ష్మి' చదివేదీ మా స్కూల్లోనే.

ఆయన మరీ బిజీగా ఉంటే, అప్పుడప్పుడు అంటే ఊళ్ళోవాళ్ళు అడిగినప్పుడు నా చేత ఉత్తరాలు చదివించడమో, రాయించడమో చేసేవారు.

ఆ పని నాకు మహా ఉత్సాహంగా అనిపించేది. ఉదాహరణకి మా కారుమంచి పోలయ్య ఉన్నాడుగదా.. (క్రామేడ్ కాదు) నా దగ్గరికొచ్చి, "పాపమ్మగారూ, మా రెండోవోడికి ఓ ఉత్తరం ముక్కరాసిపెడతారాండీ?" అని మర్యాదగా అడిగేవాడు.

"కార్డు తెచ్చావా?" నా ప్రశ్న.

"నాకేం తెలుత్తాదుండీ.. మీరే కొనియ్యాల.. ఇదిగో బేడావున్నాదండీ నాకాడ!" అనేవాడు.

"సరేపద!" ఠీవిగా నేను ముందు నడిస్తే అంత పెద్ద పెద్ద పోలయ్యా (50+) నా వెనక వినయంగా నడిచొచ్చేవాడు.

అణాపెట్టి కార్డుకొని మిగతా అణా అతనికిచ్చేసి, "ఇప్పుడు చెప్పు ఏం రాయమంటావో!" అనేదాన్ని. పెన్ను ఎప్పుడూ సిద్ధమేకదా!

"నేనీడబానే ఉన్నా.. నువ్వెట్టా వున్నావూ.. మా ఇంటిది బానే ఉంది. గొర్రెలు కోళ్ళూ బానే ఉన్నై. గేదె ఎండింది. అందుకోసం ఇల్లు గడవటం కొంచెం కష్టంగా ఉన్నాది. మిగతాది నువ్వే ఆలోచించుకో!" అనేవాడు.

ఇప్పుడు ఆ కార్డుమీద మన 'చెక్కుడు' ప్రారంభం అవుతుందన్నమాట

"ప్రియమైన కుమారుడు లక్ష్మణరావును ఆశీర్వచనములతో మీ తండ్రి కారుమంచి పోలయ్య వ్రాయునది ఏమనగా.. ఉభయకుశలోపరి. ఇక్కడ అంతా బాగానే ఉన్నది గానీ, పాడిగేదె ఎండిపోయింది. దానివల్ల పాలమీద వచ్చే రాబడి పూర్తిగా ఆగిపోయినది. మన ఆవు ప్రస్తుతం యీనడానికి రెండునెలలు పడుతుంది. కనుక యీ రెండు నెలలూ, నీకు వీలయినంత సొమ్మును మనియార్డరు ద్వారా గనక పంపితే, మన ఇంటి పరిస్థితి కాస్త కుదుటపడుతుందని నీకు యీ ఉత్తరం వ్రాస్తున్నాను. పెద్దాడికి పిల్లా జెల్లా ఉన్నారు గనక వాడి దగ్గర్నించి ఏ సహాయమూ ఆశించలేను. నీకింకా వివాహం కాలేదు గనక, తప్పని సరిగా వీలున్నంత సొమ్ముని పంపగోర్తాను. మీ అమ్మ ఆరోగ్యం బాగానే ఉంది. నీ జవాబుకై ఎదురుచూస్తూ, మీ తండ్రి కారుమంచి పోలయ్య."

ఇలా ఉత్తరం మొత్తం చెక్కి పోలయ్యకి వినిపించేదాన్ని.

"అదుండీ పాపమ్మగారూ.! అది! ఎట్టాగయినా చదువుకున్నోళ్ళు చదువుకున్నోళ్ళే! నా బుర్రలో ఉందంతా నాలుగుముక్కల్లో ఇరికించారు!" అని మహా సంతోషపడేవాడు. నేనే అడ్రస్ రాసి అక్కడే పోస్టు డబ్బాలో పడేసేదాన్ని.

ఇహ సాయంత్రానికి చూడాలి. సొరకాయో బీరకాయలో భక్తిగా తెచ్చి మా ఇంట్లో ఇచ్చేవాడు.

"ఎందుకివీ? ఇలా చేస్తే ఇంకోసారి నీకు ఉత్తరం రాసిపెట్టను!" అని కోపంగా అనేదాన్ని.

"అదేంటి పాపమ్మగారూ, ఇయ్యి మా గట్లమీద పండినై. అంత బాగా ఉత్తరం రాసి పెట్టారు. కూసిన్ని బీరకాయలిస్తే నా సొమ్మేవన్న పోతుందా?" అని బలవంతంగా ఇచ్చేవాడు. పోలయ్య వెళ్ళాక మా అమ్మ, "వద్దంటావేం? పొలంగట్ల మీద పండినవి మహా రుచిగా ఉంటై!" అనేది.

"హూ.! పెదపాడు వాళ్ళ బుద్ధి ఎప్పుడు మారుతుందో ఏమో! కార్డుముక్క రాసిపెట్టినందుకు కూరగాయలు లంచం తీసుకోవటం మా ఇంటావంటాలేదు!" అని గంభీరంగా అనేదాన్ని.

గ్యారంటీగా ఆ రాత్రి బీరకాయ+నువ్వుపొడీ వేసిన కూర యమా రుచిగా ఉంటుందనీ, దాంతోపాటు నాలుగు వడియాలు కుడా నమిలితే ఇంకా మజా వస్తుందనీ నాకు తెల్సు.

ఇలా వారానికో రెండు మూడుసార్లైనా జనాలకి ఉత్తరాలు రాసి పెడుతూ ఉండేదాన్ని. 'బాగా' రాస్తానని చాలామంది నా చేత ఉత్తరాలు వ్రాయించుకునేవారు.

ఇవాళ్టి విషయం వేరు. ఎప్పుడోగానీ మా ఇంటికి ఉత్తరాలు రావు. ఒకవేళ వొచ్చినా అవి మా అమ్మ తరఫువాళ్ళు రాసేవే. మా నాన్న వైపునించి ఉత్తరాలు రాసేవాళ్ళు లేనేలేరుగదా! అందుకే, పోస్టుమేన్ మస్తాన్ మా ఇంటిముందు నిలబడి 'పోస్ట్' అనగానే అందరం బయటికొచ్చాం. ఉత్తరం అందుకుని (ఇన్‌లాండ్ లెటర్) నేనేచించా. మా రెండో మామయ్య శ్రీమన్నారాయణ రాసిన ఉత్తరం అది. నేను లోలోపలే చదువుకుని, కొంచె గంభీరంగా మొహం పెట్టి మా నాన్నకి ఆ ఉత్తరం అందించా. "ఎవ్రరాశారూ? చెప్పవేమే భడవా?" అరిచింది మా అమ్మ.

*(మళ్ళీ కలుద్దాం)*

Post your comments